




## డెంగీ నివారణపై అవగాహన

**ప్రజాశక్తి-నెల్లూరు** డెంగీ వ్యాధి మాసోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని జనార్ధన్‌రెడ్డి కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెంకటేశ్వరపురం ప్రాంతంలో మండల ప్రజాపరిషత్తు ప్రాథమిక పాఠశాల విద్యార్ధులకు డెంగీ వ్యాధి నివారణపై వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. శుక్రవారం కీటక జనీత వ్యాధుల నియంత్రణ, నివారణ కార్యక్రమాల్లో భాగంగా ఆ పరిసర ప్రాంతాల్లో విద్యార్ధులతో ప్రదర్శన నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్ధులకు స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటి సర్వే నిర్వహించి ఫ్రై డే .. డ్రై డే కార్యక్రమ ముఖ్యోద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి, పాఠశాల ఉపాధ్యాయులు,అసిస్టెంట్ మలేరియా అధికారి యు.నాగార్జునరావు ,రిసర్వ్ సబ్ యూనిట్ అధికారి. ఓ. జయరామ్. అర్బన్ సబ్ యూనిట్ అధికారులు ఈ. శ్యాంసన్‌బాబు. రామారావు, దొరబాబు,వార్డ్ హెల్త్ సెక్రెటరీ , సీ ఓ, ఆశాలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# కేంద్రం నిధులు పంచాయతీలకే ఇస్తాం

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- తూతూ మంత్రంగా జెడ్‌పి సమావేశం
- ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎలు గైర్హాజరు

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**
కేంద్ర ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకే అందించి స్థానిక సంస్థలను బలోపేతం చేస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్‌పి చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి హాజరయ్యారు. సమావేశానికి ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎలు గైర్హాజరయ్యారు. కరేడు భూసేకరణ అంశం ప్రధానంగా సాగుతుండగా కందుకూరు ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వర్‌రావు, ఎంఎల్‌సి మాధవరావుతోపాటు వైసిపి ఎంఎల్‌సిలు రాలేదు. జెడ్‌పి సమావేశం తూతూ మంత్రంగా సాగింది. పనులు, బిల్లులపైనే ప్రధానంగా చర్చసాగింది. ప్రభుత్వ పథకాల అమలు, తల్లికివందనం, మనబడి, మన భవిష్యత్తు కింద పనులపైన చర్చసాగింది. 30 నెలల నుంచి తమకు గౌరవ వేతనం ఇవ్వలేదని, జెడ్‌పిటిసిలు నిరసన వ్యక్తం చేశారు.

జెడ్‌పి సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల సమస్యలపై జెడ్‌పిటిసి సభ్యులు అర్థవంతమైన రీతిలో చర్చించడం సంతోషకరమన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల సభ్యులకు గౌరవం, విలువ ఇచ్చే ప్రభుత్వమని, వారికి గౌరవ వేతనం మంజూరులో జరుగుతున్న జాప్యం సహించరానిదని వెంటనే జిల్లా పరిషత్ అధికారులు సమన్వయంతో కృషిచేసి గౌరవ వేతనాన్ని మంజూరు చేయాలన్నారు. స్థానిక సంస్థల నిధులను వాడుకునే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదని తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవన నిర్మాణాలను పూర్తిచేసి సచివాలయ వ్యవస్థను పురోగతిలోకి తీసుకువస్తామన్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో మూలనపడిన జల జీవన్ మిషన్



మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఖాళీగా ఉన్నకుర్చీలు

పనులను పూర్తిచేసి జిల్లా లోని గ్రామీణ ప్రాంతాల్లోని 4 లక్షల కుటుంబాలకు మంచినీటి వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి జిల్లాలోని 3,74,345 మందికి లబ్ధి చేకూర్చామన్నారు. త్వరలోనే రైతు భరోసా, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం తదితర పథకాలను అమలు చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. పిఎం సూర్య ఘర్ యోజన పథకం ద్వారా ప్రతి నియోజకవర్గానికీ పదివేల సౌర విద్యుత్ కనెక్షన్‌లను అందిస్తున్నామన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు 100 శాతం సబ్సిడీ లభించే ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో సాంకేతిక విద్యాభివృద్ధికి ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**జెడ్‌పిటిసి నిరసన**

జెడ్‌పి సమావేశం ప్రారంభం కాగానే జెడ్‌పిటిసి సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.6 వేలు గౌరవవేతనం ఇస్తుందని, తమకు 30 నెలలు వేతనం రావాలన్నారు. ఒక్కో సభ్యునికి రూ.1.80 లక్షలు ఇవ్వాలన్నారు. ఎంపిటిసి సభ్యులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇస్తున్నారని, తమకు మాత్రం ఇన్ని నెలలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. జెడ్‌పి జనరల్ ఫండ్ నుంచి తమకు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన జెడ్‌పి చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ 10 నెలల వేతనం జనరల్ ఫండ్ నుంచి ఇస్తామని, తరువాత జమ చేసుకుంటామని హామీ ఇచ్చారు.

**ప్రజా ప్రతినిధుల గైర్హాజరు**

ప్రతి మూడు నెలలకు జరిగే జిల్లా పరిషత్ సమావేశం ఎంతో ప్రాధాన్యతమైంది. శుక్రవారం జరిగిన సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఎంఎల్‌ఎలంతా అధికార పార్టీకి చెందిన వారు. ఎంఎల్‌సిలు వైసిపికి చెందిన వారు కావడం విశేషం. జిల్లాలో ఇండోసోల్ కంపెనీకి కరేడులో భూ కేటాయింపునకు సంబంధించి రైతులు ఆందోళన చేస్తున్నారు. టిడిపి, వైసిపి మద్దతు ప్రకటించాయి. జెడ్‌పి సమావేశంలో ప్రజా ప్రతినిధులు తమ వాణిని వినిపించాల్సి ఉంది. కందుకూరు ఎంఎల్‌ఎ ఇంటూరు నాగేశ్వరరావు రైతులకు మద్దతు తెలుపుతున్నారు. ఇక్కడకు వచ్చి సమావేశంలో వారికోసం మద్దతుగా మాట్లాడాల్సి ఉంది. ఎంఎల్‌ఎ హాజరు కాలేదు. వైసిపి కరేడు ఉద్యమానికి మద్దతు ప్రకటించింది. ఎంఎల్‌సిలు పి. చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీ, మాధవరావులు ఉన్నారు. వీరందరూ సమావేశానికి డుమ్మా కొట్టారు. ప్రధాన సమస్య ఉన్నప్పుడు సమావేశంలో పాల్గొని కరేడు రైతుల తరపున సమావేశంలో పోరాడుతారని భావించారు. వైసిపి ప్రజాప్రతినిదులందరూ గైర్హాజరయ్యారు. అధికారపార్టీ ఎంఎల్‌ఎలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పాశం సునీల్‌కుమార్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పి. నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కురుగుండ్ల రామకృష్ణ, హాజరుకాలేదు. ఎంఎల్‌సి బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎంఎల్‌ఎలు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, నెలవల విజయశ్రీ, కలెక్టర్ ఆనంద్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన హాజరయ్యారు.

## ఎఎస్‌పిని కలిసిన జనసేన నాయకులు

**ప్రజాశక్తి-నెల్లూరు**
నగరంలో యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి ప్రజలను పలు రకాల ఇబ్బందులకు గురిచేస్తు న్నారని, ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు నగరంలో మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే అనర్థాలు, నష్టాన్ని వివరించే విధంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరుతూ జనసేన నాయకులు టోని బాబు ఎఎస్‌పి సిహెచ్ సౌజన్యకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం నగరంలోని ఎస్‌పి కార్యాలయంలో జనసేన నాయకులు కలిసి నగరంలో చోటు చేసుకుంటున్న పలు అసాంఘిక కార్యక్రమాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కాలేజీ విద్యార్థులకు గంజాయి అలవాటు చేసి కొందరు వ్యక్తులు తమ జేబులు నింపుకుంటున్నారని ఆవేదన, ఆందోళన వ్యక్తం చేశారు. బిక్షాటన చేసే పిల్లలు వైట్నర్, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై మతిస్థిమితం కోల్పోయే స్థితిలో ఉన్నారన్నారు. వాటినన్నిటినీ దృష్టిలో ఉంచుకొని ఒక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు బుదూరి వెంకటేష్. తదితరులు పాల్గొన్నారు.




## పలకలు పంపిణీ

**ప్రజాశక్తి-కందుకూరు**
శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి ఆధ్వర్యంలో పన్నెం పద్మావతి గొల్లవారిపాలెం ప్రధానోపాధ్యాయురాలు శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యుల సహకారంతో కందుకూరు పట్టణం కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకృషి మానసిక వికలాంగుల ఆశ్రమంలోని పిల్లలకు పలకలు, బలపాలు, తదితర వస్తువులు పంపిణీ చేశారు. సందర్భంగా శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రవ్వా శ్రీనివాసులు మాట్లాడారు.కార్యక్రమంలో డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, జయవరపు కిషోర్, ప్రధానోపాధ్యాయురాలు పన్నెం పద్మావతి,చల్లా శైలజ పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు,, కార్మికులు



ఎంఎల్ఎ కోటంరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

**ప్రజాశక్తి-నెల్లూరు**
మున్సిపల్ కార్మికులు న్యాయమైన సమస్యలు అడుగుతున్నారని వారి సమస్యల పరిష్కారం కోసం తనవంతు ఖచ్చితంగా ప్రయత్నం చేస్తానంటూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తన కార్యాలయం వద్ద కార్మికులకు హామీ ఇచ్చారు. ఆరు రోజుల నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుండి కెవిఆర్ పెట్రోల్ బంక్ వద్దనున్న రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించి యూనియన్ నాయకులు కార్మికులు సమస్యలు వివరించారు. సానుకూలంగా స్పందించిన రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నెల్లూరు అధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే.పెంచల నరసయ్యలు మాట్లాడారు.మున్సిపల్ కార్మికులు ఆరు రోజుల నుంచి విధులు బహిష్కరించి తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె పోరాటం చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. నిరంతరం చెత్తాచెదారం మలినాలు మలమూత్రాలను శుభ్రపరుస్తూ కార్మికులు తమ ఆరోగ్యాలను ఫణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నారని అన్నారు. పారిశుధ్య కార్మికులు బలహీన వర్గాలకు చెందిన దళితులు గిరిజనులుగా ఉన్నారన్నారు. కాంట్రాక్టర్ల జేబులు నింపడం కోసం బలహీన వర్గాల కార్మికుల కడుపులు కొట్టడం సరైన చర్యకాదని విమర్శించారు. చాలీచాలని జీతాలతో ఇంజినీరింగ్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకులలో మున్సిపల్ కార్పొరేషన్ రాష్ట్రంలో 4వ స్థానం సాధించిందని ఇది కార్మికుల శ్రమతోనే సాధ్యమైందన్నారు. కార్మికులు తమ సమస్యలు పరిష్కరించమని విధులు బహిష్కరించి ఆందోళన చేస్తుంటే వారి గురించి ఆలోచించకుండా మొండిగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని విమర్శించారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ శాఖ మంత్రితో, అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సిఐటియు నగర నాయకులు పి. సూర్యనారాయణ, సిఐటియు రూరల్ నాయకులు సుధాకర్, శివాజీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మట్టిపాటి శ్రీనివాసులు, రాంబాబు, కిరణ్, లోకేష్, మనోజ్, రమేష్, సునీల్, దేశమూర్తి, కామాక్షమ్మ, భాగ్యమ్మ, కొండమ్మ, చంద్రమ్మ, వజ్రమ్మ, సుజాతమ్మ, సలోమి, షబ్బీర్, మరియన్న పాల్గొన్నారు.

## విద్యకు దూరమవుతున్న విద్యార్థులు

**-మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రహ్మణ్యం**

**ప్రజాశక్తి-నెల్లూరు**:గత ప్రభుత్వం అత్యుత్సాహంగా నూతన విద్యా విధానాన్ని అమలు చేసిందని, అదే విధానం కూటమి ప్రభుత్వం అమలు చేసేందుకు శరవేగంగా అడుగులు వేస్తుందని, ఈ విధానం వల్ల విద్యకు విద్యార్థులు దూరం అవుతున్నారని మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఎస్‌ఎఫ్ఐ జిల్లా ప్లీనం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ప్రతిపక్ష హోదాలో ఉన్న సమయంలో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యావిధానం వల్ల విద్యార్థులు ఎంతో నష్టపోతారని, తాము రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ విధానాన్ని రద్దు చేస్తామని హామీలిచ్చారన్నారు. నేడు అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయినా ఆ హామీని అమలు చేయకుండా విస్మరించడం దారుణమన్నారు. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఈ నూతన విద్యావిధానం తమ రాష్ట్రంలో అమలు చేసేది లేదని తేల్చిచెప్పాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పి-4 విధానాన్ని ముందుకు తీసుకొచ్చి దాని ద్వారా యథేచ్ఛగా ప్రయివేట్ విద్యా విధానాన్ని పెంచిపోషించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. కేరళ ప్రభుత్వం పాఠశాలల్లో బ్యాక్ బెంచ్.. ఫ్రంట్ బెంచ్ అనే తారతమ్యం లేకుండా తరగతి గదిలో 'యు' ఆకారంలో బెంచ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులల్లో ఎటువంటి వివక్షత లేకుండా నూతన విద్యావిధానం అమలు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా రంగంలో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటిలో ప్రధానంగా ఏవైతే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సంవత్సరకాలం పూర్తయినప్పటికీ ఇప్పటివరకు విద్యార్థులకు అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలేవి కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు.అనంతరం ఎస్‌ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఎస్‌ఎఫ్ఐ జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులుగా తోడేటి.విక్రమ్, వెన్ను నరేంద్రలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, జిల్లా ఉపాధ్యక్షులుగా దేవేంద్ర, నాని జిల్లా సహాయ కార్యదర్శి గా వంశీ, లోకేష్ ఎన్నికయ్యా జిల్లా కమిటీ సభ్యులుగా యగ్నేష్ ,దినేష్, అమర్, ప్రవీణ్, నాగేంద్ర, విష్ణు ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న విటపు బాలసుబ్రమణ్యం

## 2003 ఉపాధ్యాయులకు పాతపెన్షన్ అమలు చేయాలి

**ప్రజాశక్తి-నెల్లూరు**రాష్ట్ర ప్రభుత్వం 2004లో నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ పలు కారణాల వల్ల 2009 లో నియామకం పొందిన ఉపాధ్యాయ, ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలని డిఎస్‌సి 2003 ఉపాధ్యాయుల ఫోరం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం కేంద్రం విడుదల చేసిన మెమో 57 అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిఎస్‌సి 2003 ఉపాధ్యాయుల ఫోరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఫోరం కన్వీనర్ టివి కృష్ణయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ 16 రాష్ట్రాలలో అమలుపరిచిన మెమో 57ను ఈ రాష్ట్రంలో కూడా కూటమి ప్రభుత్వం ఎన్నికల లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 2003 ఉపాధ్యాయుల ఫోరమ్ కన్వీనర్ ఉస్మాన్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినటువంటి ప్రభుత్వం వెంటనే 2003 ఉపాధ్యాయులకు మేము 57 రద్దుచేసి పాత పెన్షన్ను అమలు చేయాలని లేని పక్షంలో ఉద్యమ ఉధృతం చేస్తామని పిలుపునిచ్చారు. అనంతరం మాసా ప్రసాద్ మాట్లాడుతూ 2003 ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పాత పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వంపై ఆర్థిక భారం కూడా ఉండన్నారు. తక్షణమే మెమో 57 ను అమలు చేసి పాత పెన్షన ఇవ్వాలని కోరారు. కన్వీనర్లు సుబ్బయ్య, భాస్కర్, శ్రీనివాసులు, సూర్య ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ ఫోరం రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు వచ్చే నెలలో విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని అధిక సంఖ్యలోఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. యుటిఎఫ్ నాయకులు చలపతి శర్మ, బాబురెడ్డి, ఏపీటీఎఫ్257 నాయకులు దశరధ, హజరత్, బిటిఎ నాయకులు మణి సుబ్బు, మాస ప్రసాద్, వేణుగోపాల్, రఘు , ఏపిటిఎఫ్ 1938 నాయకులు పిచ్చి బాబు, సుబ్బారెడ్డి, ఎస్‌టియు నాయకులు నరసింహం, ఏపియుఎస్ నాయకులు అనిల్ కుమార్ , ఆర్‌టిఏ నాయకులు ఖాజా రంతుల్ల, కిరణ్ తదితర సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలియజేశారు.



దీక్షలో కూర్చొన్న ఉపాధ్యాయులు







## జాతీయ ఆర్మీ క్యాంప్‌నకు ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల ఎన్.సి.సి క్యాడెట్ల ఎంపిక

**ప్రజాశక్తి-కందుకూరు**
ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (పి.ఇ.సి), 34(ఎ) బెటాలియన్, 185(ఎ) కాయ్-ఎస్‌డి విభాగంకు చెందిన ముగ్గురు ఎన్‌సీసీ క్యాడెట్లు పి. షంషుద్దీన్, పి. నాగరాజు, టి. అజయ్ కుమార్ లు జాతీయ స్థాయిలో ఈనెల 15నుంచి 24వ తేదీ వరకు సికింద్రాబాద్ లో నిర్వహించే ఆర్మీ అటాచ్మెంట్ క్యాంప్ కు ఎంపిక కావడం గర్వకారణమైన విషయమని కరస్పాండెంట్ కంచర్ల విజయ శ్రీనివాస్ అన్నారు.ఈ శిబిరం భారత సైన్యం ఆధ్వర్యంలో నిర్వహించబడుతుండగా, దేశవ్యాప్తంగా ఎంపికైన ఎన్సీసీ క్యాడెట్లు ఇందులో భాగస్వామ్యం అవుతారు. 10 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ శిబిరంలో, ఆయుధ వినియోగం, ఫిజికల్ ఫిట్నెస్, ఫీల్డ్ టాక్టిక్స్, డ్రిల్ వంటి అనేక అంశాల్లో క్యాడెట్లకు ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారు. ఇది వారి డిఫెన్స్ లో చేరే దిశగా కీలక అనుభవంగా నిలుస్తుంది.ప్రిన్సిపాల్ సిహెచ్ రవికుమార్ మాట్లాడుతూ," మా కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇది ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుంది." అని తెలిపారు.కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డా. కె. విజయ్ శ్రీనివాస్ స్పందిస్తూ,"ప్రకాశం కళాశాల విద్య, క్రీడలు, సామాజిక సేవల రంగాలలో ఎప్పుడూ ముందుంటుంది. ఈ విజయంలో భాగస్వాములైన ఎన్.సి.సి అధికారుల కృషిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాం." అని పేర్కొన్నారు. ఎన్.సి.సి విభాగం, గతంలో కూడా అనేక జాతీయ శిబిరాల్లో పాల్గొని కళాశాలకు పేరు తెచ్చింది.తల్సెనా శిబిరం (టిఎస్‌సి) వంటి శిబిరాల్లో పాల్గొనడం ద్వారా వారు రాష్ట్రానికి ప్రతిష్టను తీసుకొచ్చారని కూడా తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి-గుడ్లూరు**
అన్ని శాఖల అధికారులు ఆఫీసుల్లో కూర్చుని మొక్కుబడిగా పనిచేస్తున్నారని కందుకూరి ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం చేయడంలో చిత్తశుద్ధి చూపాలని ఎమ్మెల్యే అధికారులను హెచ్చరించారు. గుడ్లూరు మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ పులి రమేషు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువ సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. సమస్యలు పరిష్కారం కోసం ఆఫీసులకు వస్తే పట్టించుకోవటం లేదని అన్నారు. ముఖ్యంగా రెవెన్యూ విద్యుత్ అధికారులు సక్రమంగా పనిచేయటం లేదని ప్రజలు నుంచి ఆరోపణలు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరి పాలన దిశగా అడుగులేస్తూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ప్రతి అధికారి ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. మౌలిక సమస్యలు వెంటనే పరిష్కారం చేసి అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. గుడ్లూరు మండలంలో ఇప్పటికి 541 మంది లబ్ధిదారులు పొజిషన్ సర్టిఫికెట్ కోసం ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్యే తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై వెంకటేశ్వరరావు, ఏఓ రవికుమార్, వైజాగ్ ఆరోగ్య శాఖ నుంచి వైజాగ్ అధికారులు డాక్టర్ సాయి ప్రియాంక, ఎంఇఒ గోవర్ధన్, వార్డెన్ శ్రీనివాసులు, ఏపీవో వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు



## ప్రభుత్వాస్పత్రికి సామగ్రి అందజేత

**ప్రజాశక్తి-కందుకూరు:** కందుకూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కి వచ్చే రోగుల అవసరాల నిమిత్తం గొట్టిపాటి హరికృష్ణ సూచనతో తన తండ్రి జ్ఞాపకార్థం ఉన్నం నిషికల్ చౌదరి రూ. 60వేలు విలువచేసే నాలుగు వీల్ చైర్లు, రెండు స్ట్రక్చర్లు,14 సెలైన్స్ స్టాండ్లతో పాటు నాలుగు బీపీ ఆపరేటర్లు విరాళంగా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శకుంతలదేవికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత నిషికల్ చౌదరి మాట్లాడుతూ నా తండ్రి ఉన్నం శ్రీనివాసులు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. తన తండ్రి జ్ఞాపకార్థం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరాల నిమిత్తం ఈ వైద్య సామగ్రిని మా అన్నయ్య గొట్టిపాటి హరికృష్ణ సూచన మేరకు విరాళంగా ఇవ్వడం జరిగిందని తెలియజేశారు.ఈ సందర్భంగా మెడికల్ సూపరిండెంట్ శకుంతల మాట్లాడుతూ హాస్పిటల్ కి వచ్చే రోగుల అవసరాలు నిమిత్తం మంచి మనసుతో తన తండ్రి జ్ఞాపకార్థం విరాళం ఇచ్చిన ఉన్నం నిషికల్ చౌదరికి దానికి సహకరించిన గొట్టిపాటి హరికృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ వెంకట్ రెడ్డి, వెంకట్ నరసమ్మ, సుజాత, రాజేష్, చిట్టిబాబు, ప్రమీల, చిన్నమ్మ పాల్గొన్నారు.

## బ్యాగులు పంపిణీ

**ప్రజాశక్తి-కందుకూరు** : పద్మావతి ఫంక్షన్ హాల్ లో వరల్డ్ విజన్ సంస్థ ఆధ్వర్యంలో 57 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్ శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ పాల్గొని మాట్లాడుతూ పిల్లలు జీవితంలో లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని తద్వారా ముందుకి కొనసాగాలన్నారు. దాని కోసం సరైన ప్రణాళిక అవసరమన్నారు. చాలా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఉన్నపటికీ ప్రోగ్రాం బిజీ వలన పాల్గొనలేక పోయానని తెలిపారు. ఏదైనప్పటికి వరల్డ్ విజన్ వారు విద్యార్థుల కోసం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.



## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

**ప్రజాశక్తి-కందుకూరు**:జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్‌టిసి కావలి డిపోలో సహాయకులుగా పనిచేస్తున్న కె రవికుమార్ ఇంగ్లీష్ భాషను సరళంగా నేర్చుకొనుటకు తానే స్వయంగా తయారుచేసిన గ్రామర్ పుస్తకాలను ప్రధానోపాధ్యాయులు ద్వారకా రాణి , కందుకూరు ఆర్‌టిసి డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాస రావు ద్వారా 300 పుస్తకాలను విద్యార్థులకు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు మహల్యారావు శైలజ,ఆంగ్ల ఉపాధ్యాయురాలు ఎల్ గీత , స్టాఫ్ సెక్రటరీ ఆర్ .సుబ్బరత్నం, ఉపాధ్యాయులు శ్రీనివాసులరెడ్డి, మురళీ కృష్ణ ఇతర ఉఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జియో లాగే స్మార్ట్ మీటర్లు..

**స్పందించక పోతే నష్టపోతాం**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

**ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి**
స్మార్ట్ మీటర్లను పెట్టడానికి ప్రభుత్వం ముందుకొస్తుందని, స్పందించి అడ్డకోకపోతే తీవ్ర నష్టం జరుగుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాత్రి నెల్లూరు నగరంలోని ఎన్‌టిఆర్ నగర్‌లో స్మార్ట్‌మీటర్లపై అవగాహనపై ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో రిలయన్స్ సంస్థ జియో సిమ్ ఫోన్‌తో వచ్చిందన్నారు. తొలి రోజుల్లో ఉచితంగా బిల్లులు, ఫోన్ ఇచ్చారన్నారు. వినియోగదారులందరూ ఉచితంగా వస్తుందని జియో కనెక్షన్‌కు వెళ్లారన్నారు. ఇప్పుడు నెలకి రూ.300, రూ.500, రూ.800 అంటూ భారీగా ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని గుర్తు చేశారు. రిలయన్స్ స్మార్ట్ ఫోన్ల వల్ల పెద్ద ఎత్తున ప్రజలు నష్టపోతున్నారు. స్మార్ట్ మీటర్లు వల్ల అనేక ఉపయోగాలుంటాయని కబుర్లు చెబుతున్నారని, ఇందులో ఏమాత్రమూ వాస్తవం లేదన్నారు. ప్రీపెయిడ్‌తో కరెంట్ రీఛార్జ్ చేసుకోవాల్సి వస్తుందన్నారు. నెలకు ముందే బిల్లులు చెల్లించి కరెంట్ పొందాల్సి ఉంటుందన్నారు. ఎప్పుడు రీఛార్జ్ అయిపోతుందో తెలియదని, సామాన్య ప్రజలు తీవ్ర మైన ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. నెల్లూరులో చిన్న చిన్న టిఫెన్ అంగళ్లకు గతంలో రూ.500 వచ్చే బిల్లు ఇప్పుడు రూ.ఐదు వేల వచ్చినట్లు సమా చారం ఉందన్నారు. విజయ వాడలో పిండి మిల్లు పెట్టుకున్న ఓ వ్యక్తికి నెలకి రూ.6 వేలు బిల్లు వచ్చిందని, స్మార్ట్ మీటర్ పెట్టాక రూ.26 వేలు వచ్చిందని తెలిపారు. కరెంట్ ఛార్జీల దెబ్బకు పెద్ద పెద్ద పరిశ్రమలు మూసేసే పరిస్థితి వచ్చిందన్నారు. టెక్స్‌టైల్, గార్మెంట్, వంటి సంస్థలే మూతపడుతున్నాయన్నారు. విశాఖపట్నంలో రెండు రోజుల క్రితం స్టార్ హోటళ్ల యజమానులు సమావేశం ఏర్పాటు చేసి, కరెంట్ బిల్లులు చెల్లించలేమని చెప్పారన్నారు. కరెంట్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి ఉందన్నారు. సిపిఎం ఇప్పటికే వ్యతిరేకంగా పోరాటం చేస్తుందన్నారు. ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ బిల్లులు, ఇంటి పన్నులకు వ్యతిరేకంగా పోరాటం చేశామన్నారు. స్మార్ట్ మీటర్లు ఎట్టి పరిస్థితుల్లో పెట్టనివ్వ కూడదన్నారు. కోవూరులో ఓ ఇంటికి మీటర్ పెట్టారని, కేసు పెట్టారన్నారు. కరెంట్ ఛార్జీల పేరుతో రూ.17 వేల కోట్లు ప్రజలపై భారం వేశారని, మీటర్లకు రూ.9 వేలు ప్రజల నుంచే తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సిపిఎం నాయకులు పి. సూర్యనారాయణ, ఆవుల పెంచలయ్య, గౌతం మురళి, మాదాల శ్రీమన్నారాయణ, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ఎదుట నిరసన

**ప్రజాశక్తి-సైదాపురం** :మండలంలోని పోతేగుంట, గ్రామం దళితవాడలో పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లితండ్రులు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీపి, ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లితండ్రులు మాట్లాడుతూ కాలనీలో ఉండే విద్యార్థులను కాలనీకి దూరంగా ఉండే పాఠశాలలో విలీనం చేయడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్, మండల స్థాయి అధికారులకు,వినతి పత్రాలు సమర్పించిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా దురదృష్టకరం అన్నారు.కార్యక్రమంలో పందిటి అంబేద్కర్, సూరిపాక ఉదయ్ కృష్ణ, విద్యార్థులు,తల్లితండ్రులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ర్యాంకు సాధనలో ఇంజినీరింగ్ విభాగం

**ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్** :స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ లో 2024 -25 వార్షిక సంవత్సరానికి గాను నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 37వ ర్యాంకు సాధించడంలో కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాత్ర అత్యంత అభినందనీయమని కమిషనర్ వై.ఓ నందన్ ప్రశంసించారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు కమిషనర్ ను కలుసుకుని పూల మొక్కల కుండీలను అందజేసి శుభాకాంక్షలను తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు సాధనకు కృషి చేసిన ఇంజినీరింగ్ విభాగం ఎస్ఇ రామ్ మోహన్ రావు, ఈ.ఈ రహంతు జానీ, డి.ఈలు ముజాహిదీన్, సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాకాలపు సమస్యలపై ముందస్తు చర్యలు

**ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్:**
వర్షాకాలం లో నగర వ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కమిషనర్ వై.ఓ నందన్ తెలిపారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక కె.వి.ఆర్ పెట్రోల్ స్టేషన్ సమీప ప్రాంతం లో కమిషనర్ పర్యటించారు. అన్ని ప్రధాన రోడ్లను క్రమంతప్పకుండా శుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీరు ప్రవహించేందుకు వీలుగా అన్ని డ్రైను కాలువల్లో పూడికతీత, మురుగు తొలగింపు పనులను ప్రతిరోజూ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ శానిటేషన్ విభాగం సూపర్ వైజర్లు, ఇన్స్పెక్టర్ లు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భూముల కబ్జాపై తహశీల్దారు స్పందన

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట**

మండలంలోని పెద్ద అబ్బీపురం గ్రామ పంచాయతీకి సంబంధించిన ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని పలు మీడియాలలో వచ్చిన వార్తకు తహశీల్దారు అనిల్ కుమార్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దబ్బీపురం గ్రామ పంచాయతీలో సోమశిల కాలువ నుండి, అనుమసముద్రం చెరువుకు నీళ్ళు పోవు కాలువ కట్ట మీద దారి చేసుకుని సర్వే నెంబర్ 29లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని ఊస వెంకట్రావు ఫిర్యాదు చేయడంతో, పలు మీడియాలు ద్వారా తెలియజేయడంతో, ఈ విషయంపై క్షేత్రస్థాయి పరిశీలన, రికార్డులను పరిశీలన చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అక్కడ పనులు చేస్తున్న జెసిబిని సైతం ఆపడం జరిగిందని తెలిపారు.

## గిట్టుబాటు ధర కల్పించాలి



**ప్రజాశక్తి-కావలి** : మెట్ట ప్రాంతాల్లో పండిస్తున్న పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కావలి రైతు సంఘాల సమాఖ్య కావలి డివిజన్ కన్వీనర్ మాలకొండారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినారు. ఈ ఏడాది 140 మిలియన్ల కిలోల పొగాకు పంట సాగుకు పొగాకు బోర్డు అనుమతి ఇవ్వడం జరిగిందని తెలిపారు. కానీ ఆరుగాలం కష్టపడి ఖర్చులు పెరిగి సాగుచేసిన పొగాకుపంటకు గిట్టుబాటు ధర రావడం లేదని ఆవేదన చెందారు. కిలోకు 300 రూపాయలు ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం, కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ కృషి చేయాలని కోరుతున్నామన్నారు. పొగాకు బోర్డు ప్రేక్షకపాత్ర వహించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆరుగాలం కష్టపడి మెట్ట పొలాల్లో పొగాకు పంటను పండించిన రైతులను ఖర్చులు రాక, ఇబ్బంది పడుతున్న పొగాకు రైతులను ఆదుకోవాలని కోరారు. ముఖ్యంగా విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదించి పెడుతున్న పొగాకు రైతులపై ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని, పొగాకు రైతులను ఆదుకునే విధంగా పొగాకు బోర్డు ఆయా ప్రయివేటు కంపెనీల వాళ్లతో చర్చించి, కిలో రూ.300 గిట్టుబాటు ధర వచ్చే విధంగా కృషి చేసి, పొగాకు రైతన్నని ఆదుకోవాలని పార్లమెంట్ సభ్యులు ప్రత్యేకంగా కేంద్ర వాణిజ్య మంత్రులతో శాఖతో చర్చించి పొగాకు రైతులు ఆదుకోవాలని కోరారు.

## ఉపకరణాలు పంపిణీ



**ప్రజాశక్తి-కావలి** : కావలి మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాలలోశుక్రవారం "వాసవి సెవెన్ లయన్స్" కావలి వారి ఆధ్వర్యంలో 35 మంది విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, బలపాలు, పెన్సిల్స్, జామెట్రీ బాక్సులు, తిను బండారాలు, బిస్కెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాదంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులుకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందని, అందరూ ప్రభుత్వ పాఠశాలలలో చేరాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధా నోపాధ్యాయులు శానంకృష్ణ, మధుసూదన రావు, సెవెన్ లయన్స్ సభ్యులు డాక్టర్ పాదర్తి నాగరాజు, పెసలపవన్, సువర్ణ హెూమ్ నీడ్స్ శ్రీనివాసులు, పేరూరు శంకర్, పెట్టుగాని రమేష్, రాజా సుబ్బారావు, శేగు రంగం, ఇడిముక్కల శ్రీధర్, గ్రామ టిడిపి నాయకులు పి.వెంకటేశ్వర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యను పరిష్కరించాలి



**ప్రజాశక్తి-కోవూరు** : గత వారం రోజులుగా మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా వారు సక్రమంగా స్పందించడం లేదని, అప్పుడప్పుడు నీళ్ల ఎర్రగా వస్తున్నాయంటూ ఇనమడుగు ఎద్దలరేవు సంఘం దళితవాడ గ్రామస్తులు శుక్రవారం ఎంపిడిఒ శ్రీహరిరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పంచాయతీలో ఈ విషయం చెప్పినా వారు ఆశించిన మేర స్పందించడం లేదని, దాంతో తమ దృష్టికి తీసుకువచ్చామని ఈ సందర్భంగా గ్రామస్తులు వాపోయారు. వెంటనే ఎంపిడిఒ శ్రీహరిరెడ్డి పంచాయతీ కార్యదర్శి నాగరాజును పిలిపించి శనివారంలోగా ఇనమడుగు గ్రామంలో నెలకొని ఉన్న ఈ మంచినీటి సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇనమడుగు గ్రామస్తులు శీనయ్య, రమేష్, నారాయణ, మంగమ్మ, పెంచలమ్మ, లక్ష్మమ్మ, తదితరులు ఉన్నారు.

## ఫ్రైడే - డ్రైడేను పారదర్శకంగా నిర్వహించాలి



**ప్రజాశక్తి-కోవూరు** : మండలంలోని అన్ని గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించేలా వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగులోని పాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అరుంధతీయవాడలో జరుగుతున్న ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్లో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఎల్‌డిహెచ్‌పి పావని తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



**ప్రజాశక్తి-కోవూరు** : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్నం భోజన పథకాన్ని శుక్రవారం మధ్యాహ్నం స్థానిక అధికారులు ఆకస్మికంగా పరిశీలించారు. మండలంలోని పడుగుపాడు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఇఒ రమేష్ తదితరులు తనిఖీ చేశారు. అనంతరం వారిని కలసి విద్యార్థులతో మాట్లాడి, అందుతున్న భోజన నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం అన్నం, పప్పు, కూరలు సక్రమంగా వడ్డిస్తున్నారా, తగిన పరిమాణంలో పాలు, గుడ్లు అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ, "విద్యార్థులకు సురక్షితమైన, పోషకాహారమైన భోజనం అందించడం ప్రధాన లక్ష్యం" అన్నారు. భోజనం వండే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, సమయానికి సర్వ్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు హెచ్‌ఎం దివాకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## అర్చకుడికి నివాళులు



**ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం** : మండలంలోని జొన్నవాడ గ్రామ శ్రీ మల్లికార్జున కామాక్షితాయి దేవస్థానం వంశపారంపర్య అర్చకులుగా పని చేస్తున్న బండారు బాలసుబ్రహ్మణ్యం గురువారం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి శుక్రవారం మాజీ చైర్మన్ పుట్టా లక్ష్మి సుబ్రహ్మణ్యం నాయుడు నివాళులర్పించారు. జొన్నవాడ దేవస్థాన కార్య నిర్వహణ అధికారి ఆర్వ శ్రీనివాసుల రెడ్డి అర్చకులు సిబ్బంది బాలసుబ్రహ్మణ్యానికి నివాళులర్పించారు. అర్చకులు ఆలయ సిబ్బంది బంధువులు సమక్షంలో ఊరేగింపుగా తీసుకువెళ్లి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త ఆలయ మర్యాదలతో నివాళులర్పించారు. ఆయనకి ఆలయం ద్వారా అందాల్సిన సహకారాలు అందిస్తామని ఇఒ ఆర్వ శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు.

## సకాలంలో సరుకులు అందించాలి



**ప్రజాశక్తి-కోవూరు** : మండలంలోని అన్ని గ్రామాల్లో కార్డుదారులకు సకాలంలో సరుకులు అందించాలని డీలర్లు షాపులు పెట్టాలని తహశీల్దార్ సిహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలం లోని అన్ని గ్రామాలకు సంబంధించిన డీలర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలాఖరులో 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఇంటి దగ్గరే రేషన్ పంపిణీ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ బాలకోటయ్య, జిల్లా రేషన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండలంలోని అన్ని గ్రామాల డీలర్లు పాల్గొన్నారు.

## 'సుపరిపాలనలో తొలి అడుగు'



**ప్రజాశక్తి-వలేటివారిపాలెం** : "పేదరికం లేని సమాజ నిర్మాణమే కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం వలేటి వారిపాలెం మండలంలోని గ్రామంలో జరిగిన "సుపరిపాలన తొలి అడుగు" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. "పేదల సంక్షేమం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాల అమలుపై ప్రజల స్పందనను సేకరించారు. ఇంకా ఎవరికైనా పథకాలు అందకపోతే, వారి వివరాలను సేకరించి వెంటనే చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరావు గారికి ప్రతి నాయకులు మహిళలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షులు చొప్పర రాములు, పార్టీ నాయకులు, చెరువుపల్లి మాల్యాద్రి, చొప్పర బ్రహ్మయ్య, కామినేని అశోక్, కాకుమాను హర్ష, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఏది నిజం.. ఏది అబద్ధం..!

**ప్రజాశక్తి-కందుకూరు**

కరేడులో భూసేకరణపై ఉన్నత అధికారుల మాటలు రైతుల్లో పలు అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ఇండోసోల్ ప్రాజెక్టు కోసం ఎన్ని ఎకరాలను భూమి సేకరిస్తున్నారనేది సమస్యకు వేదిక అయింది. ఇండోసోల్ ప్రాజెక్టు కోసం ఉలవపాడు మండలం, కరేడులో 8400 ఎకరాలను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గత మార్చిలో జీఓ విడుదల చేసింది. నెలరోజుల క్రితం మొత్తంలో 4555 ఎకరాలను సేకరిస్తున్నట్లు కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పటికైతే నోటిఫికేషన్ జారీ చేసిన భూమిని మాత్రమే సేకరిస్తామని కలెక్టర్ ఓ ఆనంద్ ఓ దినపత్రికలో ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.(ప్రజాశక్తి కాదు) అయితే మిగిలిన భూమిని కొన్నాళ్ల తర్వాత సేకరిస్తారా? అనే సందేహం కలెక్టర్ మాటల ద్వారా తలెత్తుతుంది. కలెక్టర్ తన ఇంటర్వ్యూలో ఇప్పటికీ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రాథమిక భూసేకరణ అని చెప్పారు. మలి విడత భూసేకరణ ఉంటుందనే అర్థం. ఇప్పటికైతే ప్రాథమిక నోటిఫికేషన్ లో నమోదు చేసిన భూములు తప్ప మరేమీ తీసుకోమని కలెక్టర్ చెప్పడం రైతుల్లో అనుమానాలకు ఊపిరి పోస్తుంది. కలెక్టర్ మాటలు అటు ఉంచితే కందుకూరు నియోజకవర్గ అధికార పార్టీ నేతలు కూడా



భూసేకరణ చేస్తున్న కరేడు గ్రామం ఇదే

తొలి నోటిఫికేషన్‌లో నమోదైన భూముల తప్ప మరేమీ తీసుకోబోమని కరేడులో ప్రజలకు చెబుతున్నారు. కరేడు తెలుగుదేశం పార్టీ నాయకులు సైతం ఇదే ప్రచారాన్ని లంకించుకున్నారు. ప్రచారాలను రైతులు నమ్మడం లేదు. మరోసారి భూసేకరణ జరగ బోదని ముఖ్యమంత్రి స్థాయిలో ప్రకటించా లని రైతులు కోరుతున్నారు. అలాంటి ప్రయత్నాలు ఏమి అధికార పార్టీ నాయకులు చేయకపోవడంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు చెలరేగుతున్నాయి. భూ సేకరణను వ్యతిరేకిస్తున్న కరేడు రైతులు సాగిస్తున్న ఉద్యమాన్ని అణిచివేయడానికే అధికార పార్టీ నాయకులు ఇలాంటి మాయ మాటలు చెబుతున్నారని రైతులు భావిస్తున్నారు.

**భూసేకరణ పరిహారంపై గగ్గోలు..?**

మాగాణి పంట పొలాలకు ఎకరానికి 12 లక్షల 50 వేల రూపాయలు పరిహారం ఇస్తామని కలెక్టర్ ఆనంద్ ఓ పత్రికతో మాట్లాడుతూ అన్నారు. ఇది రైతుల్లో తీవ్ర ఆగ్రహావేశాలను రేకెత్తించింది. కరేడు చెరువుకు ఉత్తరం వైపు నున్న మాగాణి పొలాల ధర బహిరంగ మార్కెట్లో ఎకరానికి రూ. 10 నుంచి రూ.11 లక్షల వరకు ఉంది. చెరువుకి దక్షిణం వైపు ఉన్న అలగాయ పాలెం, వాక, కొత్తపాలెం మాగాణి భూములు ధర బహిరంగ మార్కెట్లో ఎకరానికి రూ.20 నుంచి రూ.22 లక్షల వరకు పలుకుతుంది. తమ మాగాణి భూములను సగం ధరకే ఇండోసోల్ పరిశ్రమకు ఇవ్వాలా అని అలగాయపాలెం రైతులు తీవ్ర స్వరంతో ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైన భూముల ధరల ప్రాతిపత్రికగా భూసేకరణ పరిహారం నిర్ణయిస్తుంది. భూముల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎకరానికి రూ.6 నుంచి రూ.7లక్షలకు మాత్రమే నమోదయ్యాయి. బహిరంగ మార్కెట్లో ఈ భూమి మరో మూడు రెట్లు ఎక్కువ ధరకు క్రయవిక్రయాల సాగుతున్నాయి. ఈ వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా అధికారులు భూములకు పరిహారం నిర్ణయిం చడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.


## అఫ్రాన్ పనులు సత్వరమే పూర్తి చేయాలి

**ప్రజాశక్తి-అనంతసాగరం**



ఆఫ్రాన్ పనులు పరిశీలిస్తున్న నాయకులు

దెబ్బతిన్న ఆఫ్రాన్ పనులను యుద్ధ ప్రాతిపదికన త్వరగా పూర్తి చేయాలని కౌలు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు నెల్లూరులో జులై 15, 16 తేదీలో జరిగిన సందర్భంగా కౌలు రైతు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు సోమశిల జలాశయంను, నిలిచిపోయిన ఆఫ్రాన్ పనులను పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోమశిల జలాశయం ప్రమాదపు అంచులో ఉందని ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు ఈ జలాశయం వరదకు దెబ్బతిన్న ఆఫ్రాన్‌ను చూసి త్వరలోనే ఆఫ్రాన్ పనులను పూర్తి చేస్తామని హామీలు ఇచ్చారు కానీ పనులు పూర్తి చేయలేదన్నారు. జిల్లాలో ఉండే అన్ని చెరువులు, కాలువలో 200 టిఎంసిల నీరును నిల్వ ఉంచగలిగే ఈ ప్రాజెక్టు పనులను గాలికి వదిలేయడం మంచిది కాదన్నారు. గత ప్రభుత్వంలో నీటి పారుదల శాఖ మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి ఈ జిల్లా వాసులే, ప్రస్తు తం దేవాదాయ శాఖ మంత్రి ఈ నియోజకవర్గం ఎంఎల్ఎగా ఆనం రామ నారా యణరెడ్డి ఉండి కూడా ఈ స్థితిలో జలాశయం ను వదిలేయడం అంటే ఈ జిల్లా రైతాంగాన్ని, ప్రజలను మోసం చేయడమేనన్నారు. బనకచర్ల పూర్తి చేసి భవిష్యత్తులో చుక్క నీరు కూడా వృథా కానివ్వం అని చెప్పే ముఖ్యమంత్రి ప్రస్తుతం ప్రమాదపు అంచులో ఉండే ఈ జలాశయం పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే జలాశయం వద్ద సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నదని వెంటనే ఖాళీ ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. జలాశయం పరిశీలించిన రిపోర్ట్‌ను రైతుసంఘం రాష్ట్ర కమిటీ తరుపున ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం రైతు సంఘం రాష్ట్ర నాయకులు బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గురునాథం, సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా,రైతు సంఘం మండల నాయకులు ఉప్పలపాడు మస్తాన్, రాటకొండ పెంచలనాయుడు, దాదా మస్తాన్, సిఐటియు మండల నాయకులు మీరా మొహిద్దీన్, రసూల్, నాగులూరు వెంకటేష్, అంకయ్య, మస్తాన్, బాలేష్, వంశీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ సంజయ్‌కుమార్

## రోడ్డు వేయండి సారూ..

**ప్రజాశక్తి-సంగం**

ఇందిరమ్మ అభయ హస్తం – ఇంటింటికి కాంగ్రెస్‌లో భాగంగా సంగం మండలం జెండా దిబ్బ గ్రామంలో అస్తవ్యస్తంగా గుంతల మయమైన రోడ్డు వెంటనే వేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కే సంజయ్ కుమార్ తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ చేవూరు శ్రీధర్ రెడ్డి సూచన మేరకు పర్యటన జరిగిందని, గుంతల రోడ్డు వల్ల గర్భిణులు స్కూల్ పిల్లలు వృద్ధులు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, హాస్పిటల్‌కు వెళ్లాలన్నా ప్రాణాన్ని అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోయినట్లు సంజయ్ తెలిపారు. గ్రామంలో పర్యటిస్తూ 15ఏళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ హయాంలో వేసిన రోడ్లు తప్ప ఇప్పటివరకు ఎవరు పట్టించుకోలేదని, ఎక్కడికి అక్కడ డ్రెయినేజీలు దోమల బెడదతో ప్రజలు అల్లాడుతున్నారని రూరల్ కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, జిల్లా ఒబిసి అధ్యక్షుడు ఎస్.నరేష్ తెలిపారు. మైనారిటీలు, బిసిలు ఎక్కువగా కలిగిన ఈ గ్రామంలో వితంతువులు, పెన్షన్లు లేక గుడిసెల్లోనే కాలం వెళ్లబుచ్చుకున్నారని అన్నారు. కార్యక్రమంలో సామాజికవేత్త అడ్వకేట్ సుధాకర్ రెడ్డి, షేక్ బాబు సుభాని, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు కల్పించాలి

**ప్రజాశక్తి-అనంతసాగరం**



ఉపాధి హామీ పథకంలో ప్రతి కుటుంబానికి వంద రోజులు పనులు కల్పించాలని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. స్థానిక గ్రామపంచాయతీలో శుక్రవారం జరిగిన ఉపాధి హామీ పనులలో భాగంగా చేపట్టిన కుంట పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ వేతనం దారులతో మాట్లాడుతూ కొలతల ప్రకారం పని చేసినట్లయితే ప్రభుత్వం నిర్ణయించిన రూ.307 వేతనంగా పొందవచ్చని తెలిపారు. సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకుల ద్వారా రోజువారి చేయవలసిన పని మార్కింగ్ ఇప్పించుకున్నట్లయితే ఆ కొలతల ప్రకారం పనిచేసి పూర్తి వేతనం ఉపాధి హామీ పథకం ద్వారా పొందవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పని ప్రదేశంలోని హాజరును పరిశీలించారు. ఉపాధి హామీ వేతన దారులకు వారు చేయాల్సిన పనులను తప్పనిసరిగా మార్కింగ్ చేసి వారు పూర్తి వేతనం పొందే విధంగా సహకరించాలని క్షేత్ర సహాయకునికి సూచించారు. ఎక్కువ పనులను గుర్తించి ఎక్కువమంది పేద కుటుంబాలు ఉపాధి పొందే విధంగా అంచనాలు రూపొందించాలని సాంకేతిక, క్షేత్ర సహాయకులకు సూచించారు.

## నేడు వైద్య శిబిరం

**ప్రజాశక్తి-బిట్రగుంట** : బోగోలు మండలం కొండ బిట్రగుంట గ్రామంలో శ్రీ బిలకూట క్షేత్ర శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ కార్యదర్శి అరవ రాధాకృష్ణ, వి సత్యనారాయణ చార్యులు వారి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉచితంగా మైగ్రేన్, సైనా సైట్ ఇస్, భుజము, వెన్నుపూస, నడుము మొదలకు వ్యాధులకు చెన్నై నుండి ప్రముఖ డాక్టర్లు వస్తున్నారని ఈ అవకాశాన్ని బోగోలు మండల ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు.

## జిఒ 36ప్రకారం జీతాలు పెంచాలి

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**



నిరసన తెలియజేస్తున్న కార్మికులు

ఇంజనీరింగ్ కార్మికులకు జిఒ నెంబర్ 36 ప్రకారం వెంటనే జీతాలు పెంచాలని, సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఉద్యోగులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకుంది. మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల సమ్మెలో భాగంగా ఉదయం 10:30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12:30 నిమిషాల వరకు సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి మద్దతుగా ఎఐఐఇఎ (ఎల్ఐసి) ఎస్ డబ్ల్యూ ఎఫ్ ( ఎపిఎస్ఆర్‌టిసి) యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, ఆవాజ్, అంగన్‌వాడీ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిచి సమ్మెను పరిష్కరించాలని, జిఒ నెంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని గతంలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో యుఇఇయు రీజనల్ అధ్యక్షుడు కొండమూరి హజరత్తయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, ఎల్ఐసి యూనియన్ నాయకులు టి రమేష్, జాన్ ప్రభాకర్, ఎస్డబ్ల్యుఎఫ్ నాయకులు భాస్కర్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు రాధమ్మ, ఆవాజ్ నాయకులు యస్దాని, మున్సిపల్ ఎంప్లాయిస్ నాయకులు నాగేంద్ర, రిజ్వాన్, చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

## జెడ్‌పి పాఠశాలలో తనిఖీలు

**ప్రజాశక్తి-ఉదయగిరి** : నూతనంగా ఏర్పాటైన జిల్లా ఉన్నత పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి–2 తోట శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమికోన్నత స్థాయి నుండి జిల్లా ఉన్నత పాఠశాలగా మార్చబడిన జిల్లా ఉన్నత పాఠశాల బిసి ఉర్దూ పాఠశాలను ఆయన తనిఖీ చేసి ప్రార్థనా సమయానికి పాఠశాలకు చేరుకొని ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లా డుతూ ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే మంచి క్రమశిక్షణ గల విద్యార్థిగా ఉండడం చాలా ముఖ్యమని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థుల అభ్యసన పఠన సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలు వారి తరతి స్థాయికి తగ్గట్టుగా ఉన్నవని ఉపాధ్యాయులను అభినందించారు. మనబడి మన భవిష్యత్తు పనులను పరిశీలిస్తూ మిగిలి ఉన్న పనులకు త్వరలో నిధులు



మాట్లాడుతున్న ఎంఇఒ తోట శ్రీనివాసులు

మంజూరు అయ్యేట్లుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసు కెళ్తామని ప్రధానోపాధ్యా యురాలు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాల అభివృద్ధికి ఏ వనరులు అవసరమవుతాయో తెలపాలని కోరారు. విద్యార్థులకు చదువుతోపాటు మంచి క్రమశిక్షణ గల విద్యార్థులుగా తయారు చేయాలని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యురాలు షేక్.నూర్జహాన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డిఎస్‌పి శ్రీధర్‌కు సత్కారం

**ప్రజాశక్తి-కావలి**

కావలి సబ్ డివిజన్ పోలీసు అధికారి శ్రీధర్‌ను కావలి రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు శుక్రవారం కలసి జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు కావలి సబ్ డివిజన్ పరిధిలో రక్తదాన శిబిరాలు నిర్వహించి, తమ రక్తకేంద్రంకు అండగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తలసేమియా డే కేర్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పామూరు శ్రీధర్, గత ఆరు నెలలుగా తలసేమియా బాధిత చిన్నారులకు అందిస్తున్న సేవలను వివరించారు. ప్రతీ చిన్నారికి రెండు లేదా మూడు వారాలకు ఒకసారి ఉచితంగా రక్తం ఎక్కించడంతో పాటు, మందులు, పౌష్టికాహారం దాతల సహకారంతో అందిస్తున్నామని వివరించారు. కావలి పట్టణంలోని వైద్యులు వారికి కావలిసిన స్కాన్, ఇతర పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. తాము నిర్వహిస్తున్న తలసేమియా సందర్శించి బాధిత





డిఎస్‌పి శ్రీధర్‌కు సత్కరిస్తున్న దృశ్యం

చిన్నారులకు అండగా నిలవాలని కోరారు. డిఎస్‌పి శ్రీధర్ స్పందిస్తూ స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న రెడ్‌క్రాస్‌కు తనవంతు సహకారం అందిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె హరినారప రెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, పాలకమండలి సభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, జనిగర్ల మనోహర్, గొట్టిపాటి మనోరమ, తలసేమియా డే కేర్ సెంటర్ సబ్ కమిటీ సభ్యులు కల్లయ్య పాల్గొన్నారు.

## రాజకీయాల్లో విమర్శలు సహజం

**ప్రజాశక్తి-విడవలూరు**



ఇటీవల గత కొంత కాలంగా వైసిపి, టిడిపి మధ్య దాడులు అనుచిత వ్యాఖ్యలు జరుగుతున్నా యని దానిపై రాష్ట్ర ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి చొరవ చూపాలి అని ఇలాంటి సంఘటనలు జరగకుండా అరికట్టే విధానానికి జిల్లాలో ఉన్న నాయకులతో మాట్లాడి పరిష్కారం చేయాలని పోలిరెడ్డి అశోక్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చౌకచర్ల గ్రామంలో ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నోయేళ్ల నుండి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి దగ్గర పరిచయాలు అలాగే ప్రసన్నకుమార్ రెడ్డి పలమార్లు తమ ఇంటికి వచ్చినట్లు తెలిపారు. అయితే వేమిరెడ్డి కుటుంబం వ్యక్తిగత విషయాలు మాట్లాడడం ప్రసన్న అన్నకు సరికాదని, అలాగే ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేయడం కూడా సరికాదన్నారు. గత ప్రభుత్వంలో కూడా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఇంటిపై దాడులకు పాల్పడం, గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్మోహన్ రెడ్డి అప్పట్లోనే ఖండిస్తే ఈరోజు నెల్లూరు జిల్లాలో ప్రసన్నకుమార్ రెడ్డిపై ఇలా జరిగేది కాదని గుర్తు చేశారు.



## విద్యార్థులు ఫోన్లకు దూరంగా ఉండాలి

**ప్రజాశక్తి-బిట్రగుంట**

విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండడం మంచిదని లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుతారని, బిట్రగుంట ఎస్ఐ ఎన్.ప్రభాకర్ పేర్కొన్నారు. సంఘంలో విద్యార్థులకు, మహిళలకు జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు మంగమూరు జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, సైబర్ మోసాల గురించి, రోడ్డు ప్రమాదాల గురించి, మహిళలు, బాలబాలికలపై జరిగే నేరాలు, ఇతర చట్టాలు, శిక్షలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఆధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి-వరికుంటపాడు**

మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి-కోవూరు**



కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోకపోతే అటువంటి వారిని గుర్తించి వారిని ఓటర్లుగా నమోదు చేసేలా తగు చొరవ తీసుకోవాలని తహశీల్దార్ సిహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే ఇంట్లో ఉండే భార్యాభర్తలు వేరువేరు వార్డుల్లో ఓటర్లుగా నమోదై ఉన్నారని, అటువంటి వారిని గుర్తించి వారిని ఒకే వార్డులో ఓటరుగా చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. 1200 దాటిన ప్రతి పోలింగ్ బూత్‌కు మరో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో బుచ్చి తహశీల్దార్ ఎ.వెంకటేశ్వర్లు, కొడవలూరు తహశీల్దార్ స్ఫూర్తిరెడ్డి, కోవూరు ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ సురేష్, సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, వివిధ పార్టీ రాజకీయ నాయకులు ఉన్నారు.

## గిరిజన కాలనీకి విద్యుత్ సౌకర్యం

**ప్రజాశక్తి-అనంతసాగరం**

మండలంలోని పడమటి కంభంపాడు గ్రామంలో ఉన్న గిరిజనుల ప్రాంతంలో కరెంట్ స్తంభాలు వేసి కరెంట్ సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు అనేక రకాలుగా పోరాడిన ఫలితంగా శుక్రవారం గిరిజన ప్రాంతంలో కరెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. తమ ప్రాంతంలో కూడా కరెంట్ సౌకర్యం వస్తుందని గిరిజన కుటుంబాల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

**ప్రజాశక్తి-కలిగిరి** : కలిగిరి ఆదర్శ పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్య క్రమాన్ని నిర్వహించారు. ఎన్నారై నీలిమ 150 మొక్కలను దానం చేశారు. ఈ కార్యక్రమానికి సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర, సభ్యులు ఎం.చంద్రశేఖర్, షేక్.మంజాన్ బీ హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ కళాశాల ప్రాంగణంలో సీఐ వెంకట నారాయణ ఎన్‌సిసి విద్యార్థులతో కలసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ వెంకట నారాయణ, ఎస్ఐ ఉమాశంకర్, మండల విద్యాశాఖ అధికారి సురేష్, టిడిపి మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, సర్పంచ్ వెంకట సుబ్బయ్య, జనవిజ్ఞాన వేదిక సభ్యులు మేడం. నరసింహారెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ కొండారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అన్నవరపు శ్రీనివాసులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఎపి అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

**ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్**



ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి టిడిపి అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని పాత జంగాలపల్లి టిడిపి యువ నాయకులు వీరపురెడ్డి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం శుక్రవారం మండలంలోని నువ్వూరుపాడు పంచాయతీ మజరా పాత జంగాలపల్లి గ్రామంలో తెలుగుదేశం నాయకులతో కలిసి నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనలు మేరకు సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గడపగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వారికి కరపత్రాలు అందజేశారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు సాగుతుందని వారన్నారు. కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు ఎస్‌కె మస్తానువలీ, గ్రామ టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజావలీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 1న జాబ్‌మేళా

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట** : నిరుద్యోగ యువతీ యువకులకు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, డిఆర్‌డిఒ మాజీ చైర్మన్ జి.సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఆగస్టు 1,2 తేదీల్లో మెగా జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందని ఈ విషయాన్ని మండల ప్రజలకు విస్తృత ప్రచారం చేయాలని తహశీల్దారు అనిల్ కుమార్, ఎంపిడిఒ పి.ప్రసన్నకుమారి సంయుక్తంగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలిపారు. కావున ఈ విషయాన్ని నిరుద్యోగులు గమనించి సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.